నంగనాచి

"కావ్యశ్రీ"

సముద్ర తరంగాలు ఒకదానొకటి పరంపరగా తరుముకొనివచ్చి—వచ్చిన పనేమిటో తెలియకుండానే—తిరిగిపోతున్నట్లు రజని మనస్సులో—చిక్కులుపడ్డ దారపు వుండల్లాంటి—అర్థం తెలియని ఆలోచనలు అనంతంగా వచ్చి—వచ్చిన వెంటనే—మెరుపుల్లా మాయమైపోతున్నాయి. ఏమిచేయటానికీ తోచక తోచినదేదీ చేయలేక—ఆ రాత్రంతా, రజని మాటులో కూర్చున్న పులి వేటగానిలా—జాగరణ చేస్తూ వుంది. "మాధవయ్య తాతను పెళ్ళాడాలి" అన్న తండ్రి మాటలు మాత్రం—అవ్యఘాలులాగ—ఎన్నిమారులు వచ్చినా యేమాత్రం మార్పులేకుండా—మాటిమాటికి జ్ఞాపకం వస్తూనేవున్నాయి. "తన ప్రియుడు అమెరికానుంచి తిరిగి వస్తాడు. తానొక పెద్ద ఆఫీసరు భార్యయై—వలచి వలపించుకొన్న ఆ తియ్యతీపుల సంసారంలో—వంద నందనవనాల సుందర సుఖజీవితాన్ని అనుభవించుదామనుకొన్న తన మధురస్వప్నాలన్నీ మృగతృష్ణలు కావలసిందేనా" తర్కించేకొలదీ యీ సమస్య బ్రహ్మపదార్థంలాగ మరీ క్లిష్టమైపోతూవుంది. "మానవయ్య తాతను పెళ్లాడాలి" అనే విషయం—భూమి గుండ్రముగావుంది—అన్నంత సత్యంగా గోచరించగానే రజని ధైర్యం—తళ్లికోట యుద్ధానంతరం ఆంధ్ర సామ్రాజ్యములాగ క్షీణింపసాగింది.

అప్పటికి రాత్రి మూడుగంటలయివుంటుంది. రజని ఆలోచనలకు అంతరాయం కలిగించి దొడ్డి గుమ్మం తలుపు నెమ్మదిగా తెరచుకొన్న చప్పుడయ్యింది. ఆ చీకటిలో యెవరో తనవైపే రావటం చూచి రజని కంగారుపడి "ఎవరు వారు" అని అడిగింది. కాని ఆ వచ్చిన వ్యక్తికి "అరచి"నట్లుగానే వినిపించింది. దానితో ఆ వ్యక్తి స్తంభించిపోయి త్రాడుతెగిన గాలిపటములా దిగజారిపోయింది. రజని కింకా దడ తగ్గనేలేదు. ఆ సమయంలో యెవరు ఎవరిని చూచి యెక్కువగా భయపడుతున్నారో సరిగా చెప్పటం కఠినం కాదు. మరలా అడిగింది రజని. "ఎవరంటే మాట్లాడవేం?" మాట్లాడుతున్నదన్నమాటే గాని కనీసం లేవటానికికూడా ధైర్యం చాలటంలేదు రజనికి.

"నేనక్కా" నెమ్మదిగా పలికింది ఆ వచ్చిన వ్యక్తి.

"పద్మా! నువ్వా!" సూర్యచంద్రులను దేవతలుగా భావించి ఉపాసించే సనాతనుడు—అమెరికా వారు ఉపచంద్రగ్రహాలను సృష్టిస్తున్నారు—అన్న సంగతి విన్నప్పుడు పొందినంత—విస్మయాశ్చర్యాలతో అడిగింది రజని.

"ఎక్కడకు వెళ్లావు?"

"అలా బయటకు వెళ్ళాను" తండ్రి పరుసులో డబ్బులు దొంగిలించి పట్టుబడిపోయిన కుర్రాడిలాగ బిత్తరపోయింది పద్మ. "ఎప్పుడు?" ధీమాగా లేచి కూర్చుంది రజని.

"ఇప్పుడే — నిద్రపట్టక — పెరట్లో బంతి మొక్కలదగ్గర కూర్చున్నాను" అంటూనే—సింహగర్జనవిని లేచిన లేడిపిల్లలా — కంపించిపోతూ గబగబా వెళ్లి తన మంచంమీద పడిపోయింది పద్మ. రజని మనస్సులోని యీ ఆలోచనలు—గట్లు త్రెంచుకొని ప్రవహించిన 1953 గోదావరివరదలులాగ—పరవళ్లు త్రొక్కుతున్నాయి. "పద్మ బయటకు వెళ్లిందెప్పుడు? తాను పడుకొన్నప్పటినుంచీ మెలకువగానే వుందే! ఒకవేళ—తన మనస్సు అమెరికాలోనున్న ప్రియునిదగ్గరకు పోయినప్పుడు—వెళ్లటం వల్ల తాను గమనించలేకపోయిందా" అనుకొంటూ వుండగానే— ఒకవూహ — కఠోరకర్కశగాఢాంధకారంలో మొండిగా పయనించే పిరికి బాటసారికి—తళుక్కుమన్న మెరపుకాంతిలో—యెదురుగా ఒక మహోగ్రకాలసర్పం — కనిపించినట్లు —ఒక భయంకరమైన వూహ—వచ్చి రజని హృదయాన్ని ఛిన్నా

భిన్నం చేసివేసింది. "పద్మ తప్పుదారి బట్టలేదు గదా" రజని గుండెలు ఝల్లుమన్నాయి. రాత్రి అందరూ పడుకొన్న తర్వాత పదకొండూ పన్నెండు గంటలవేళ పద్మ బయటకు వెళ్లటం పరధ్యానంగా చూచిన రజనికి లీలగా జ్ఞాపకం వచ్చింది. "ఇంత సేపూ — పద్మ — పెరట్లో బంతిమొక్కలదగ్గర — వట్టినే — కూర్చుందా?" ఈ ప్రశ్నకు సమాధానము రాకముందే దండశాసనుడైన తండ్రి పౌరుషము — తనకు మిగిలిన కులగౌరవము — వంశమర్యాద — వాటిని చూసుకొనే తనకు తన చెల్లెలికి పెళ్లి చేయాలని తండ్రి చేస్తున్న భగీరథయత్నం — ఒక్కసారిగా రజని కళ్ళముందు గిర్రున తిరిగాయి. "నిజంగా తన చెల్లెలు దారితప్పితే — యింకేమున్నావుంది — యిల్లు వల్లకాడే —" రజనిమనస్సు గ్రద్ద తన్నుకుపోతున్న కోడిపిల్లలా రెపరెపలాడింది. మళ్లా కాస్సేపటికి బుద్ధిమారింది. "పద్మ నిజంగానే నిద్రపట్టక — వట్టినే — పెరట్లో — కూర్చుందేమో. అనవసరంగా అనుమానించటం తన మనోదౌర్బల్యాన్నే సూచిస్తుందేమో. తనకుమాత్రం నిద్రపట్టిందా. కాదంటే తాను పడుకొనే — కళ్లుమూసుకొని ఆలోచిస్తూ వుంది — తనకొక ప్రియుడంటూ వున్నాడు కాబట్టి. బహుశా యిప్పుడెంతో టయిముకూడా అయివుండదు. పద్మను అనుమానించటం కేవలం తన మానసిక బలహీనతయే" అనుకొంటూ వుండగానే సన్నగా కునుకు పడుతూ పడుతూ వుండటంవల్ల ప్రక్కనున్న మధు గారియింట్లోనున్న గోడగడియారం టంగ్ టంగ్ మని కొట్టిన గంటలెన్నో సరిగా తెలియలేదు రజనికి. కాని యింకా సరిగా నిద్రపట్టకముందే చిన్న చెల్లెలు రమ లేపటంవల్ల లేచిన రజని అప్పటికే తెల్లగా — తెల్లవారిపోవటం స్పష్టంగానే చూసింది.

రజనితండ్రి కనకయ్య బ్రతికి చెడ్డ పెద్ద కుటుంబీకుడు. పూర్వులనాటిది మిగిలినదల్లా ప్రస్తుతముంటున్న పాత పెంకుటిల్లు ఒకటే. తాతలనాటి నుంచీ వస్తున్న కులపౌరుషము — వంశమర్యాద — ఆధారంగా చేసికొని — గ్రామపంచాయతీ బోర్డులో గుమాస్తాగిరీ చేస్తూ — చేయిచాపకుండా — గౌరవంగానే — గుట్టుగా కాపురం చేసుకొస్తున్నాడు కనకయ్య. కనకయ్యకు రజని పెద్దకూతురు. పద్మ, రమ, తర్వాతివాళ్లు. మగపిల్లలు లేరు. భార్యపోయి మూడు సంవత్సరాలు కావచ్చింది. పెద్దవాళ్లైకూర్చున్న పెద్దకూతుళ్లకిద్దరకూ పెళ్లిళ్లు చేయాలని భార్య వున్నప్పటినుంచీ ప్రయత్నాలు చేస్తూనేవున్నప్పటికి కట్నం యివ్వలేని కారణంవల్ల యింతవరకూ ఒక్కపిల్లకయినా సంబంధం స్థిరపర్చలేకపోయాడు కనకయ్య. అమెరికాలోనున్న మేనల్లుడు చంద్రశేఖరరావు రజనిని ప్రేమించాడని — అమెరికానుంచి వచ్చినవెంటనే పెళ్లిచేసుకొంటాడని భార్యద్వారా విన్న కనకయ్య తన కేమీ తెలియనట్లుగానే — సంబంధాలకోసం వెదుకుతూ — శేఖరం రాకకోసం ఎదురుతెన్నులు చూస్తున్నాడు. "తనకూతురు శేఖరంభార్యయైతే — అబ్బో యెంతసుఖం — ఎంత ఆనందం — శేఖరం పెద్దఆఫీసరవుతాడు — కానీ కట్నం అక్కరలేకుండా చేసుకొంటాడు —" పెదవులు దాటకుండా లోలోనే ఆనందిస్తున్నాడు కనకయ్య. కాని యింతలో తాను బాకీవున్న దూరపుబంధువు రెండవభార్యకూడా పోవటం — అతని సంపదకు వారసులు లేనికారణం చేత అతను మళ్లా వివాహమాడ సంకల్పించటం — అతని కన్ను తనకు బాకీవున్న కనకయ్య పెద్దకూతురు రజనిమీదపడటం జరిగింది. రాయబారాలు జరిగాయి. ఇంతకుముందే డిక్రీ అయిపోయివున్న రెండువేల రూపాయల అప్పుకూ ప్రతిఫలంగా తనయిల్లు వదులుకొని వెళ్ళిపోవటమూ — లేక రజనిని మాధవయ్యకిచ్చి పెళ్ళిచేయటమూ — అన్న విషయంలో కనకయ్య ఉత్తరపక్షమే నిర్ణయించాడు. రజనీ మాధవయ్యల వివాహం నిర్ణయమైపోయింది. ముహూర్తం యింక మూడురోజులుమాత్రమే వుంది.

మరునాడు మధ్యాహ్నం మధుగారి యింటి పనిమనిషివచ్చి వెళ్ళిపోవటం చూచిన పద్మ కళ్లు ఎర్రబడ్డాయి. కలిగిన భావాలనన్నీ మనసులోనే అణచుకొని తెచ్చికోలునవ్వుతో వచ్చి అడిగింది. "ఏం! అక్కా! మళ్లా వచ్చిందా ప్రణయలేఖ" సన్నగా నవ్వింది.

"ఇది ప్రణయలేఖ కాదు పద్మా నాపాలిటి మరణలేఖ"

"వెధవ! యెంతడబ్బుంటేమాత్రం యింత కండకావరమా? సంసారుల పిల్లలకు ప్రేమలేఖలు రాస్తాడా! అక్కా! యిదంతా నువ్విచ్చినలోకువే! ఒక్కసారి నాన్నతో చెపితే సరిపోయేది. మళ్లా మళ్లా వచ్చేవికాదుగా యిటువంటి వెధవ ఉత్తరాలు."

"నిజమే అనుకో! కాని మధు అంత తుచ్ఛుడు కాదనుకొంటున్నాను. నిజంగా నన్ను ప్రేమించాడేమో—"

"ఏం! చూడగా చూడగా కోతి నాతి అయిందన్నట్లు నీకు మతి మారిపోయిందేమిటి?"

"అదికాదే—" సాఫీగా చెప్పబోయింది రజని.

"కాక-వాడి ముఖం వాడేమిటి? ప్రేమేమిటి? ఆ పశువులో పేరు తప్ప మరేమన్నా వుందా—మంచి—అనేది?" పద్మ మాటలకు రజని ముఖం కొద్ది కొద్దిగా అరుణారుణము కాజొచ్చింది. పద్మ మళ్లా అంది. "ఒకవేళ నీకే మనసుపోయిందా వాడి మీదికి?" రజని సన్నగా నవ్వి నిట్టూర్చి అంది "పద్మా! నీతో ఒక సంగతి చెప్పాలనుకొంటున్నానే"

"ఏమిటది?"

పద్మ కంగారుపడి సంబాళించుకొంది.

"మధు నన్ను ప్రేమించినట్లుగా రెండు సంవత్సరాలనుంచీ ఉత్తరాలు పంపిస్తూవున్నాడు—నిజంగా ప్రేమ కాకపోతే యిది యింతకాలం వుంటుందంటావా."

"అందుకేమంటావ్" ఎనిమిదవ ఎడ్వర్డు సింప్సన్ సతిని పెళ్ళాడటంకోసం సింహాసనాన్ని పరిత్యజిస్తున్నాడన్న వార్త విన్నప్పుడు చర్చిలకు కలిగినంత సందేహం కలిగింది పద్మకు.

"పోనీ—మధు అయినా సంతోషిస్తాడు—నన్ను పెళ్లాడమని అడుగుతాను—" అతి సాధారణ విషయంలా చెప్పింది రజని.

"ఆ! నిన్ను పెళ్ళిచేసుకోమని మధుని నువ్వే అడుగుతావా?" తనకొడుకు తన శత్రువైనహరి నే పూజిస్తున్నాడని తొలిసారిగా విన్నప్పుడు హిరణ్యకశిపుడు పొందినంత—అబ్బురపాటు—గుర్పాటు—సంకటపాటు—ఒక్కసారిగా పొందింది పద్మ.

"అవును. ఏం అలా అడుగుతున్నావు?"

"ఆ దుర్మార్గుడు—ఆ వ్యభిచారి—ఆ జూదరి—ఆ త్రాగుబోతు—ఆ—ఆ—పొగరుబోతుతో నీకు పెళ్లా"—బోనులోనున్న ఆడుసింహంలా అరిచింది పద్మ. ఆమె శరీరం మంగలంలోని పేలాలులాగ-చిటపటలాడిపోతూవుంది. రజని బరువుగా నిట్టూర్చి కాస్సేపాగి చెప్పింది. "బాగా ఆలోచించే మాట్లాడుతున్నాను పద్మా! మాధవయ్య తాతను పెళ్లాడటం యెలాగా తప్పదు. ఆ పెళ్ళివల్ల నాకెలాగా సుఖం లేదు—మాధవయ్యతాతకూడా సంతోషించలేడని నానమ్మకం. ఎందుకంటే సాధారణంగా ఆ స్థితిలోనున్న ప్రతి మగవాడూ భార్యమీది అనుమానంతో—తన మనస్సుతోబాటు భార్య జీవితాన్నికూడా నాశనం చేస్తాడు. ఇక మధుని పెళ్లాడితే—అతను నన్ను కొట్టాడు. ప్రేమించాడు. కాబట్టి కనీసం అతనైనా సంతోషిస్తాడు. మాధవయ్యతాతకు నాన్న యివ్వవలసిన ఋణం తీర్చేస్తే మధునే పెళ్లాడుతాను." ఆమాటలు పూర్తిగా వినకుండానే దెబ్బతిన్న బురద పాములా పద్మ చరచరా గదిలోకి వెళ్ళిపోయింది. అప్పటి ఆమె నడకలో ఒక తడబాటు—ముఖంలో ఒక కళవళపాటు—స్పష్టంగా గోచరించాయి. అంతలో వరదజల్లు వచ్చినట్లుగా పద్మ చటుక్కున తిరిగివచ్చి తీక్షణంగాచూస్తూ అడిగింది. "అయితే శేఖరం బావ నేంచేదామనుకొంటున్నావ్. అమెరికా నుంచి తిరిగివచ్చి యిదేమిటంటే యేంచెపుతావ్"

"శేఖరం సంగతి దైవానికే విడిచి పెడుతున్నాను పద్మా! నీకింకా చెప్పలేదు. అన్నీ స్థిరమైపోయాయి. రేపు సాయంత్రంలోపుగా బాకీ తీర్చటంగాని—ఎల్లుండి నన్ను మాధవయ్యగారికిచ్చి పెళ్లిచేయటంగాని జరగాలి. బాకీతీర్చటం యెలాగా లేదు కాబట్టి—యీ పెళ్లి యెలాగా తప్పదు. అందుకేగా నాన్న మొన్ననగా తాతగారియింటికి వెళ్లాడు పెళ్లిఖర్చుకు డబ్బు తేవటానికి. ఒకవేళ నే ననుకొన్నట్లుగా మధు అంగీకరిస్తే మాధవయ్య తాతకు బదులు మధు నామెడలో మంగళసూత్రం కడతాడు. కాబట్టి యిక శేఖరం బావమాట లేనేలేదు. బావ యివాళే వస్తాడని నువ్వు జోస్యం చెప్పినా నేను నమ్మను."

"అయితే మధుకు ఉత్తరం రాస్తావా?"

"కాదు. నేనే వెళతాను స్వయంగా—రాత్రికి—"

"ఆ! రాత్రికి—స్వయంగా—ఒంటరిగా—అతనిదగ్గరకు వెళతావా" ఒక్కసారి జడ విదిల్చికొట్టి "తోడురమ్మని నన్నుమాత్రం అడగకు. నేను రాను. మధుగాడి మొఖంచూస్తేనే నాకు ఒళ్లు మంట. ఆ పాపిష్టిముఖం చూస్తే పంచమహాపాతకాలూ పట్టు

కుంటాయి" అనేసి క్షణం నిలబడకుండా వెళ్ళిపోయింది పద్మ. రజని తనలో తాను నవ్వుకొంది. "పద్మ అన్నట్లుగా మధు త్రాగుబోతు. జూదరి కాకపోయినా — అతనంటే తనకూ అసహ్యమే — కాని పద్మలా తాను కుండ బ్రద్దలుకొట్టినట్లు చెప్పగలదా! అబ్బే — యేదీ తనకా ధైర్యం? ఈ మెత్తదనం చూసేకాబోలు మధు మరీ ధైర్యంగా కబురు లంపుతున్నాడు. అదే పద్మకయితే కబురుదెచ్చినదాన్ని పంపినవాడినీకూడా పళ్లు రాలేటట్లు కొట్టేది. ఈ సంగతి తెలిసేకాబోలు మధు పద్మమాటయినా తలపెట్టడు. ఈరోజుల్లో పద్మలాగే వుండాలేమో" అనుకొంటూవుంటే క్రితంరాత్రి తాను పద్మమీద పడిన అనుమానానికి కారణం కేవలం తన బలహీనతే అనుకొంది రజని. నిప్పులాంటి తన చెల్లెల్ని అనుమానించినందుకు నొచ్చుకొంది రజని.

ఆరాత్రి బహుశా పదిగంటలై వుంటుంది. రజని పద్మతో చెప్పి మధు రూముకు బయలుదేరింది. "నాతో చెపుతావెందుకు — మధు దగ్గరకు కాకపోతే మహాసముద్రంలోకి వెళ్లు—నీయిష్టం" అంటూ రుసరుసలాడుతూ ముసుగుతన్ని పడుకొంది పద్మ. "తన చెల్లెలికి తనమీద యెంత ప్రేమ. తన సుఖంకోసం ఆమె నిండు మనసుతో యెంతగా ఆకాంక్షిస్తూ వుంది" అనుకొంటూ రజని ప్రహరీగోడ తిరిగి గేటులోనుంచి మల్లెపందిరిఅవతలనున్న మధు గది దొడ్డిగుమ్మంలోకి వెళ్ళి నిలుచుంది. సిగరెట్టు కాలుస్తూ పడుకొని ఆలోచిస్తూవున్న మధు గాజుల గలగలలు విని—యిటు చూచి—రజనిని చూచి — భగవంతుని చూచిన నాస్తికునిలా సంభ్రమాశ్చర్యాలతో కొయ్యబారి పోయాడు. కాస్సేపటికి తేరుకొని అన్నాడు "రజనీ—నువ్వా! రా రజనీ—లోపలకు రా" అతని మాటల్లో చంటిపిల్లాడిలాగ నత్తికూడా వచ్చింది. రజని లోపలకు వచ్చి తలుపు ఓరగావేసి గడియపట్టుకొని తలుపు ప్రక్కనే నిలబడివుంది. "ఇలా వచ్చి యీ సోఫాలో కూర్చో రజనీ—" యిప్పటికి పూర్తిగా సర్దుకొని అన్నాడు మధు.

"నేను కూర్చోవటానికి రాలేదు మధూ."

"మరి..." తానేదో మహా తెలివిగా మాట్లాడినట్లుగా ఫోజు పెట్టాడు.

"హాస్యానికిది సమయంకాదు మధూ" రజని కంఠంలో కోపచ్ఛాయలు మందమందంగా వినిపించాయి.

"మరి దేనికి సమయం? రాకరాక వచ్చావు. ఇన్నాళ్ళకు నీకు మనసు మళ్ళింది. రా రజనీ! యెంత ఆనంద సమయం."

"మధూ! నన్ను నిజంగా ప్రేమిస్తున్నావా?"

"ఇంకా సందేహమా! మన ప్రేమసాక్షిగా ప్రేమిస్తున్నాను."

"అయితే ఒక మాట అడగనా."

"అడుగు. ఒకటేమిటి? లక్ష అడుగు" పారిజాతానికై అలిగి కూర్చున్న సత్యభామకు కృష్ణుడిచ్చినట్లుగా హామీ యిచ్చాడు. "నన్ను పెళ్ళాడతావా మధూ" రజని గొంతులోని జీర అపశ్రుతిలా కఠోరంగా వినిపించింది. పెళ్లి అనేటప్పటికి మధు గుండెలు గుభిల్లుమన్నాయి. ఎంతో శ్రమపడి మాయ చేసి బంధించిన శివాజీ ఖైదునుంచి తప్పించుకొని పారిపోయాడని విన్నప్పుడు ఔరంగజేబు పొందినంత నిర్విణ్ణతను పొందాడు మధు. "పె...ళ్లా..." మూలిగినట్లుగా అన్నాడు. "అవును. ఏం అలా కంగారుపడుతున్నావ్" నిలవేసింది రజని. "ఏంలేదు. పెళ్ళంటేను—" ఓడిపోయిన యం.యల్.ఏ.లాగ— నిస్సహాయంగా — చేతగానితనంగా — చూశాడు మధు. "అవును. పెళ్ళాడాలి. ఆలోచించటానికి కూడా వ్యవధి లేదు. ఇష్టమో కాదో యిప్పుడే చెప్పాలి" ఆమె గొంతుకలో గాద్గద్యము తొణికిసలాడుతూ వుంది. మధుకు ధైర్యం వచ్చింది.

"అంత తొందరేమొచ్చింది రజనీ."

"నీకు తెలియనిదేముంది మధూ! మా నాన్న మాధవయ్యగారికి రెండువేలు బాకీవున్నాడు. అది డిక్రీకూడా అయిపోయింది. ఈ లోకువ చూచి మాధవయ్యగారు నన్ను తనకిచ్చి పెళ్ళిచేయమని పట్టుబట్టారు. చేయకపోతే యిల్లు రేపే వేలం అయిపోతుంది. తక్కిన పిల్లల క్షేమం ఆలోచించి మానాన్న యీ పెళ్లి చేయటానికే అంగీకరించాడు మధూ!" ఆమెకంఠం దుఃఖంతో పూడుకుపోతూవుంది. "మధూ! మా నాన్న బాకీ తీరిస్తే నిన్ను పెళ్ళాడటానికి సిద్ధంగా వున్నాను మధూ" శత్రుతుల్యుడైన

మధుని తనంతట తాను తనను పెళ్లిచేసుకోమని అర్థించటం రజనికి—తప్ప త్రాగివచ్చిన భర్తచేత తప్పు లేకుండానే తన్నులుతింటూవున్న యిల్లాలికి వున్నంత—కష్టంగా వుంది. రజని మూడవ పెళ్ళి ముసలాడి భార్య కాబోతూవుందని తెలియగానే మధుమనసు కొక వింత యాలోచన తట్టింది. "ఆమె నూర్జహాను—తాను అపర జహాంగీరు" లోలోపల నవ్వుకొన్నాడు. "నీకు నామీద ప్రేమ లేదుగా. ఇక నేను పెళ్లాడితే మాత్రం నీకు సుఖమేమిటి?" "నా సుఖం సంగతి విడిచిపెట్టు మధూ! నువ్వు నన్ను ప్రేమించావు—వాంఛించావు—కాబట్టి కనీసం నువ్వయినా ఆనందిస్తా వనుకొన్నాను" మధు వెటకారంగా నవ్వి అన్నాడు. "నా ఆనందంకోసమా! కాదు నీస్వార్థం కోసం" ఆ మాటలు రజనికి కటువుగానే వినిపించాయి. అయినా తాపీగానే చెప్పింది. "కాదు మధూ! నా స్వార్థంకోసమైతే నిన్నే పెళ్ళాడ నక్కరలేదు డబ్బుంటావా మాధవయ్యగారుకూడా నీలాంటి లక్షాధికారే. ఏం? పెళ్ళి అనడంతో కష్టంగా వుందా."

"నాకయితే యిష్టమే.." అర్ధోక్తిగా చూశాడు

"మరీ—" అభ్యంతర మేమిటన్నట్లుగా చూచింది.

"మా నాన్న—"

"ఊఁ! మీనాన్న—వద్దంటాడా."

"వద్దనడు. కానీ కట్నం కావాలంటాడు" నసిగేడు మధు.

"ఒక్క దెబ్బయివేలు—అవునా" మెడకు దగ్గరగా బల్లెపుపోటు తిన్న త్రాచుపాము చేయగలిగింది లేక బుసకొట్టినట్లు—యేడవలేక బాధగా నవ్వి అంది "మరి నువ్వు నన్ను ప్రేమించావుగా."

"ఆమాట అక్షరాలా నిజమే అనుకో."

"అంత ప్రేమించినవాడవు మీ నాన్నకు నచ్చజెప్పి కట్నం లేకుండా పెళ్ళాడలేవా" సవాలు చేసినట్లడిగింది.

"అది నా వశంకాదనుకొంటున్నాను రజనీ" నిర్మొగమోటంగా అన్నాడు మధు పెడమొగం పెట్టి. రజనికి అరికాలిమంట తలకెక్కింది. "అవును—పెళ్ళాడటమెలా వశమవుతుంది. ప్రేమించానంటూ అయిచ్చకాలాడి—చేతికందితే బాధ్యతారహితంగా అనుభవించి వదిలేయటమైతే వశమవుతుంది కాబోలు. ఇంతకాలంనుంచీ యింటిచుట్టూ యింతగా తిరుగుతూ వుంటే నిజంగా ప్రేమించావని భ్రమించాను. కాని యింత గోముఖవ్యాఘ్రాని వనుకోలేదు." మధుకు కూడా కొంత చురుక్కుమన్నట్లుంది—నిరసనగా అన్నాడు. "మహా చెప్పొచ్చావ్! నువ్వు మాత్ర మేంచేశావ్? ఎన్ని కబుర్లంపినా ఒక్కనాడైనా నావైపు కన్నెత్తి చూశావా? ఇప్పుడు ముసలి తాతను పెళ్లాడవలసివచ్చింది కాబట్టి నామీద మహా ప్రేమున్నదానిలా నటింప వచ్చావు—సంగనాచి-" సీరియస్‌గా చూచి కాలుస్తున్న సిగరెట్టు నేలకేసి కొట్టి కొత్త సిగరెట్టు వెలిగించాడు. "నేను నిన్ను ప్రేమించానని పొరపాటునకూడా అనలేను మధూ—ఈ పరిస్థితుల్లో ముసలాడినే కాదు—గూనును పెళ్లాడినా—అసలు పెళ్లాడకపోయినా ఒకటే నాకు. సెలవ్!" అనేసి చటుక్కున తలుపుతీసి బయటకు వెళ్ళిపోయింది రజని. ఎప్పటికైనా తన "వంట యింటి కుందేలే" అన్నట్లు గుండెల్లో నవ్వుకొని అన్నాడు మధు "మంచిది వెళ్లు! కానీ ఒక మాట—నీకు డబ్బుకావాలంటే పట్టుకువెళ్ళు—రెండు వేలు కాదు నాలుగు వేలిస్తాను. నాకు ప్రియురాలుగా మాత్రముండు.. పెళ్ళంటావా నీయిష్టం—" అప్పటికే నాలుగుబారలదూరం వెళ్లిన రజని తోకత్రొక్కిన పన్నగాంగనలా గిరుక్కున వెనక్కు తిరిగి—సముద్రకెరటంలాగ వచ్చి "మధూ! కాస్త కళ్లు తెరచి మాట్లాడు. మనిషిగాపుట్టాక మనిషిగా బ్రతకటం నేర్చుకో. ఒక పయోముఖవిషకుంభమునుంచి పొందిన ప్రతిబిందువు విషముమాత్రమే అని నాకు తెలుసు మధూ" అనేసి తారాజువ్వలా దూసుకుపోయింది రజని. పదిలక్షలరూపాయలపజిల్లో ఫస్టుప్రైయిజు వచ్చిందని టెలిగ్రాంవస్తే ఉబ్బి తబ్బిబ్బయిపోతూ వున్న జూదగానికి వెనువెంటనే "క్షమించండి—మీకు కాదు" అని మరోక టెలిగ్రాంవస్తే యెలా వుంటుందో అలావుంది అప్పటి మధు మనసు.

అర్థం తెలీయకుండా కంఠస్థంచేసిన యింగ్లీషు పద్యాన్ని విద్యార్థిపరీక్షలో వ్రాసి ప్యాసయినట్లే—రజనీమాధవయ్యగార్ల కళ్యాణం అయ్యిందంటే య్యిందనిపించారు. కనకయ్య పెదాలు నవ్వుతూ

వున్నా కళ్లు యేడుస్తూవుండేవి. పద్మ ఒక్క పెట్టున బావురుమని యేడ్చేది. ఎంతనుంది వూరుకోబెట్టినా వూరుకోలేకపోయింది పెళ్ళినాడు. చివరకు రజని వచ్చి "ఊరుకో పద్మా! నాకు లేనిబాధ నీకెందుకు — శుభమా అంటూ కళ్లనీళ్లు పెట్టకమ్మా" అనేటప్పటికి — ప్రపంచాన్ని జయించాలని ఆశించి తుదకు తన దేశములోనే బహిష్కరింపబడిన నెపోలియన్ లాగ — పూర్తిగా ఓడిపోయింది పద్మ. పెళ్ళయిన మూడవనాడే రజని అత్తవారింటికి వెళ్ళిపోయింది. కనకయ్య యింటికి యాభై, అరవై గజాలదూరంలో అవతలవీధిలో వుంది మాధవయ్యగారి యిల్లు. రెండు మూడురోజుల కొకసారి రజని పుట్టింటికి వచ్చి చూచి వెళుతూవుండేది. రజని వచ్చినప్పుడల్లా ఆమెకు జరిగిన అన్యాయాన్ని తలచి తలచి యేడ్చేది పద్మ. పద్మ పెళ్లి గురించి మాట్లాడేది రజని. ఒకసారి మాటల సందర్భంలో మధుమాట వచ్చింది అగ్గిమీద గుగ్గిలంలా భగ్గుమంది పద్మ "వెధవ! యింకా అటువంటి వేషాలు వేస్తే చెప్పుతీసుకొని పళ్లు రాలగొడతానని కబురంపు" అంటూ పళ్లు పటపటలాడించింది పద్మ. రజని సరదాగా నవ్వి వేళాకోళంగా అంది. "ఇంక నన్ను మరిచిపోతాడులే! దగ్గరగా నువ్వున్నావుగా — మళ్లా నీమీద పట్టిస్తాడు" రజని నవ్వు చూచి సహించలేక గుండుదెబ్బతిన్న ఆడుపులిలా అరచింది పద్మ. "ఏమిటే! నామీదా — అసలు నావంక కన్నెత్తిచూడమను చెపుతాను — ఇంక యీవూళ్లో బ్రతికి బట్టకడతాడా — తల గొరిగించేయనూ" రజని నవ్వి అంది. "నువ్వంతటిదానవేచెల్లీ — నువ్వంటే మధుకేకాదు మగవాడన్న ప్రతివాడికీ హడలే — మా మరిది నేంచేస్తావో మరి —" చెల్లెలి చెంపలు నిమిరి ముద్దు పెట్టుకొంది రజని.

మాధవయ్యకు యేక్షణంలోనూ పనిగాని తీరుబడిగానీ వుండదు. ఇంట్లో వున్నంతసేపూ పిల్లలు లేరని బాధపడిపోవటం — వీధిలోకి వెళితే కనుపించిన వాడినల్లా పిలిచి యెందుకో ఒకందుకు చీవాట్లు పెట్టటం మాధవయ్యగారి ముఖ్యమైనపనులు. గ్రామానికంతకూ ధనికుడు కాబట్టి పెద్దగా చెలామణీ అయిపోతున్నాడు.

ఆవేళ రజని కెందుచేతనో మనసు బాగాలేదు. దష్టితగిలిన చంటిపిల్లలులాగ యేమీ లేకుండానే మాటిమాటికి త్రుళ్లిపడుతూవుంది. మనస్సు వున్నట్టుండి ఒక్క గంతులో అమెరికావెళ్లి వాలింది. ఆ పరధ్యానంలో బంగారు పొన్నుకర్ర టకటక శబ్దంగానీ మాధవయ్య పిలుపుగానీ వినలేకపోయింది రజని. "ఏమే నిన్నే —" కొంచెం గట్టిగానే అన్నాడు మాధవయ్య.

"ఆ! పిలిచారా! వస్తున్నా" ఉలుక్కుపడి లేచి నిలుచుంది.

"ఎందుకండీ పిలిచారు?" ఇప్పటికి పూర్తిగా మెలకువ వచ్చింది.

"భర్త భార్యను పిలవటానికికూడా కారణం కావాలా" నెరస్తూ నెరస్తూవున్న కోరమీసాల్లోంచి సన్నగా ముసిముసి నవ్వులు నవ్వాడు మాధవయ్య. ముదిమి రెండవ బాల్య మన్నట్లుగా ఆ వృద్ధునిలో తిరిగి యౌవనలక్షణాలు పొటమరించాయేమో! ఆ మాటకు రజని యేలా అర్థం చెప్పుకుందోగానీ ముఖం మాత్రం గంభీరంగా మారిపోయింది. ఆ యెరుపు దనాన్ని తగ్గించుకోవటానికి ఆమెకు కొద్ది క్షణాలు పట్టాయి. "చాల్లే — చెప్పుదురూ — ఎందుకూ పిలిచారు?" ఎంతో తియ్యగా మెత్తగా అడిగింది. ఆమె మాటల్లో నిండు భార్యాత్వాన్ని — ఆప్యాయతను చూడగలిగిన మాధవయ్య మనసు సంతృప్తితో పులకించింది. రజనిలో తన మొదటిభార్యను చూడగలిగాడు మాధవయ్య.

"చూడు — మన శేఖరాన్ని నువ్వెరుగుదువు కదూ — నువ్వెరుగకపోవడ మేమిటి మీ మేనత్త కొడుక్కే కదూ — నాకు స్వయానా వేలువిడిచిన పెదతాతగారి మనుమడి కొడుకు — నీకు తెలిసేవుంటుంది. నాలుగేళ్ళక్రితం అతన్ని ప్రభుత్వం చదువుకోసం అమెరికా పంపించింది —" శేఖరం అనేటప్పటికి అతని క్షేమం వినాలని అహమహమికతో తహతహలాడిపోతూవున్న రజని మాధవయ్య చెప్పే పాత పురాణాన్ని వినలేక మధ్యలోనే ఆపుచేసి అడిగింది. "శేఖరం బావున్నాడా అండీ!" తాను చదువు చెప్పించి కొడుకులా చూచుకొంటూవున్న శేఖరం అంత గొప్పవాడయ్యాడంటే మాధవయ్య నిలువునా సంబరపడిపోతూ వున్నాడు. మధ్య మధ్య తన కన్న కొడుకు అలాగ అయితేనా అనుకొంటూ నిట్టూరుస్తూ రజనివంక దీక్షగా చూస్తూవున్నాడు.

ఇంతలో రజని మళ్లా అడిగింది "ఏమండీ! ఎలా వున్నాడు శేఖరం?" "దొరలా వున్నాడు — చదువు పూర్తయిపోయిందట — యింతక్రితమే వచ్చేశాడు — ముందుగా టెలిగ్రాం యివ్వటానికికూడా టయిము లేకపోయిందట పాపం". శేఖరం వచ్చాడనగానే — కనకాభిషేకం పొందినప్పుడు శ్రీనాథకవికి కలిగినంత-ఆనందం కలిగింది రజనికి. "మన రాష్ట్రానికంతకూ పెద్ద యింజనీరు అవుతాడట — రేపో యెల్లుండో వెళ్ళిపోవాలట — అందుకు రేపే మన యింట్లో విందు ఏర్పాటు చేస్తున్నాను." మను చరిత్ర కృతి స్వీకారంనాడు శ్రీకృష్ణదేవరాయలు పొందినంత మహాహర్షాన్ని పొంది పొంగిపోతూ బయటకు వెళ్ళిపోయాడు మాధవయ్య. రజని మనస్సులోని ఆనందవిచారాలు గంగా యమునల్లాగ — తెల్లగా — నల్లగా — కలసిపోయి — అంతర్వాహినులై ప్రవహిస్తున్నాయి. పగిలిన కుంభపెంకుల్లా చెల్లాచెదరైపోయిన అలౌకికభావాలతో సతమతమవుతూ వుంది రజని.

ఆ సాయంకాలం అన్యాయత్తచిత్తంతో రజని వీధిచావడిలో రేడియోముందు కూర్చుని వుంది. మరెవ్వరూ లేరు. మనసు శేఖరంమీదికి పోవటంతో రేడియో వినలేక దాన్ని ఆపుచేసి ఆలోచిస్తూ వుంది. "శేఖరం బావతో మాట్లాడటమెలాగ? మాట్లాడకుండావుండటమెలాగ? చనిపోయినమాధవయ్యభార్యలను పిలిచినట్లుగా తననుకూడా "పిన్నీ" అని పిలుస్తాడా? ఘోరం! ఏముఖం పెట్టుకొని తాను బావను — మీదుమిక్కిలి వలచి వలపించుకొన్న ప్రియుని — కొడుకుగా భావించగలదు?" ఇలాంటి భావాలతో సంఘర్షణపడుతూవుండగా . వీధిలో ఎవరిదో కేక వినిపించింది. "మాధవయ్యగారూ" అంటూ మళ్లా కేక! "ఎవరువారూ" అంటూ రజని యింకా గుమ్మంలోకి వెళ్లకముందే మధు లోపలకు వచ్చేశాడు. మధును చూడగానే రజనిముఖం — తుఫాను పట్టబోయేముందు ఎరుపెక్కిన ఆకాశంలాగ — గంభీర గౌరవర్ణారుణారుణమైపోయింది. ముందుగా అతనే ప్రారంభించాడు.

"మాధవయ్యగారింట్లో లేరని చెప్పబోతున్నావు కదూ! నీకా శ్రమ అక్కరలేదు. లేరని తెలిసే యిలా వచ్చాను."

"అయితే మరెందుకు వచ్చావ్" వంటిమీద ప్రాకుతూవున్న జెర్రిని విదలించినట్లుగా సీత్కారంతో అడిగింది.

"నీతో ఒక ముఖ్యవిషయం మాట్లాడాలి."

"అక్కరలేదు. తమరు వెంటనే వెళ్ళిపోతే మంచిది."

"ముందు నేను చెప్పేది విని తర్వాత నీయిష్టం వచ్చినట్లుగా చెయ్" అంటూ ఆమె మాట్లాడటానికి అవకాశం యివ్వకుండానే మధు ప్రారంభించాడు. "శేఖరం ఎల్లుండి వెళ్ళిపోతాడు — మనంకూడా యెల్లుండే లేచిపోదాం — మీ రిద్దరూ ప్రేమించుకొన్నట్లు ఈ వూరివాళ్లందరూ యెరుగుదురు కాబట్టి శేఖరమే నిన్ను తీసుకుపోయాడనుకొంటారు. నీకు శేఖరంచేసిన దగాకు పగ తీర్చుకోవచ్చు — పోలీసులు అతన్నే పట్టుకొంటారు. మన మీలోపులో బొంబాయి —" అతనిమాట లింకా పూర్తికాకముందే చెంపలు పేలిపోయేటట్లు ఛెళ్లు — ఛెళ్లుమని రెండు చెంపకాయలు తగిలాయి. మధు పిడుగుపడినవాడిలా — మాడిపోయాడు. రజని — మహిషాసురమర్దనంనాటి కాళికాదేవిలాగ — మహోగ్ర రౌద్రరూపిణియై మూడవసారి చేయెత్తి సిద్ధంగా వుంది. లంచంతిన్న గుమాస్తా పట్టుబడిపోయి అధికారిముందు నేరం ఒప్పుకొన్నట్లుగా నిస్సహాయంగా చూచి "రజనీ" బాధగా అన్నాడు. మరొకసారి చెంప ఛెడేలుమంది. "నోరుముయ్! స్త్రీ అంటే హృదయంలేని జంతువనో మెదడులేని యంత్రమనో అనుకొంటున్నావు కాబోలు నీయిష్టం వచ్చినట్లుగా ఉపయోగపడటానికి! జాగ్రత్త — పో బయటకు!" అల్లసాని పెద్దనామాత్యుని పద్యశూలానికి వెరగంది వెనుదిరిగిన గజపతిలాగ ముఖం పైకెత్తకుండా వెళ్ళిపోయాడు మధు.

ఆ మరునాడు శేఖరం గౌరవార్థం మాధవయ్యగారియింట్లో విందు జరిగింది. గ్రామపెద్దలు చుట్టుపట్లనున్న ఉద్యోగులు చాలమంది హాజరయ్యారు. కాబోయే యింజనీరు శేఖరాన్ని యెన్నో విధాల ప్రశంసించారు. అవేవీ శేఖరం చెవి కెక్కటంలేదు. కళ్లు రజనికోసం దూరదర్శిని యంత్రాలులాగ వెదుకుతున్నాయి కనీసం గొంతుకయినా వినిపించదేమూ అని శేఖరం మహోత్కంఠతో నిరీక్షిస్తున్నాడు. కడకు "రేపు వెళ్ళిపోతున్నాను — వెళ్లిపోయేముందు

కడసారి దర్శనమిస్తే సంతోషం—ఆశీర్వదించి పంపిస్తావని నమ్ముతున్నాను—" అని చిన్న చీటివ్రాసి రమ చేతికిచ్చి పంపించాడు.

ఆరాత్రి మాధవయ్యతో చెప్పి రజని పుట్టింటికి వచ్చింది. రజని వచ్చేటప్పటికి రమ నిద్రపోతూవుంది. పద్మ యేడుస్తూవున్నట్లుగా అనిపించింది రజనికి. కాని వెంటనే లేచి కనుపించకుండా కళ్లు తుడుచుకొని కళవంతంగా చిరునవ్వు తెచ్చుకొంది పద్మ. కనకయ్య పద్మ పెళ్ళిసంబంధానికని పొరుగూరు వెళ్ళాడు. అక్కా చెల్లెళ్లిద్దరూ కాస్సేపు లోకాభిరామాయణ పారాయణ చేసినతర్వాత "శేఖరంతో మాట్లాడటానికి" వచ్చానని—చెప్పింది రజని.

"ఈ రాత్రే వెళ్ళకపోతే రేపు పగలు వెళ్ళకూడదా" అడిగింది పద్మ.

"నలుగురి కళ్ళల్లోను పడటం నా కిష్టంలేదు."

"కళ్ళల్లో పడకపోతే పాపం కాకపోతుందా."

"నేనే పాపకార్యం చేయటానికీ అక్కడకు వెళ్ళటంలేదు."

"అవును. పాపం అనుకొంటే నువ్వలా చేయనే లేవుగా—తండ్రి సంగతీ—భర్త సంగతీ తెలిసీకూడా—అర్ధరాత్రి వేళ పరపురుషునిదగ్గరకు—అందులోనూ యింతకుముందు ప్రేమించుకొన్న మేనత్తకొడుకు దగ్గరకు—ఒంటరిగా వెళుతున్నావంటే — యెంత సాహసం" లాయరులా వాదించింది పద్మ.

"పద్మా—నన్ను అపార్థం చేసుకోకు."

"నేను చేసుకోకపోతే లోకం చేసుకోదా—కట్టుకొన్న మగడు చేసుకోడా—" జ్యోతిషం చెప్పింది పద్మ. "చెల్లీ! యిందులో నీకు తెలియని దాపరికమేమీ లేదు. బావా నేను ఎంతగా ప్రేమించుకొన్నామో—మా కెటువంటి పాట్లు పట్టాయో చూస్తూ నేవున్నావు. బావ రేపు వెళ్ళిపోతూవున్నాడు. ఒక్కసారి మాట్లాడటానికి రమ్మంటే వెళుతున్నాను. బహుశా యిక జన్మలో మరెప్పుడూ బావతో మాట్లాడవలసి రాదనుకొంటున్నాను పద్మా" జాలిగా అంది. "అయితే బావదగ్గరనుంచి తిరిగి వస్తావా" పుల్లవిరిచి కొరడచినయట్లు—కఠినంగా అంది పద్మ. "అంటే—" అర్థంకాక తెల్లముఖం పెట్టింది రజని. "బావ రేపు వెళ్లిపోతూవున్నాడుగా—" అర్థోక్తిలో "నువ్వుకూడా" అన్నట్లు సాగ తీసింది పద్మ. అప్పటికి అర్థమయ్యింది రజనికి. గుండెల్లో గుండుసూదులు గ్రుచ్చినట్లుగా లోలోన రోదించింది. పద్మమీద కలిగిన అసహ్యంతో—కోపంగా "రాను—" ధీమాగా అంది రజని.

"అక్కడనే పడుకొంటావా—" మాట మార్చి పోటుపొడిచింది.

"అవును—" అదే కోపం —యేడుస్తూవున్న చంటిబిడ్డను సముదాయించలేక—విసుగెత్తిన తల్లి "ఏడు—చావు" అని వ్యతిరేకంగా అన్నట్లే—రజని మాటల్లో వ్యతిరేకభావం స్పష్టంగా మెరసింది.

"ఈ సంగతి వింటే పిల్లలకోసం తపసు చేస్తున్న మా ముసిలిబావగా రేమనుకొన్నా —నాన్న వింటేమాత్రం సహించడు."

రజని వళ్ళు మండిపోయింది—చాచి చెంప మీద ఛెళ్లుమనిపించింది. "పద్మా—హద్దూ పద్దూ లేకుండా నోటికి వచ్చినట్లుగా మాట్లాడకు. నీ మనస్సింత నికృష్టం—యింత పాపభూయిష్టం అని నే నెప్పుడూ అనుకోలేదు. మంచిగా ఆలోచించటం నేర్చుకో" అధికారస్వరంతో మందలించింది రజని. పద్మ పరాభవంతో—పౌరుషం పట్టలేక—కసిగా యేడుస్తూ ముసుగుబిగించి పడుకొంది. ఉరిశిక్షను విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పేముందు బోనులో వున్న హంతకుడు కంపించిపోయేటట్లు — యేదో మహాప్రమాదం వస్తున్నట్లుగా పద్మ కుమిలిపోతూ వుంది.

కనకయ్యగారియింటికి రెండిళ్లు అవతలవుంది శేఖరంయిల్లు. వృద్ధురాలయిన తల్లి మధ్యగదిలో నిద్రపోతూవుంటే శేఖరం వసారాలో పడుకొని రజని రాకకోసం యెదురుచూస్తున్నాడు. మెత్తని అడుగుల చప్పుడు పసిగట్టి యెదురువచ్చి రజనిని లోని కాహ్వానించాడు. "వచ్చావా రజనీ—రా—" రజని లోపలకు వచ్చి చాపమీద కూర్చుంటూ అంది: "నా హృదయం పిలిచినతర్వాత రాకుండా యెలావుంటుంది బావా" శేఖరం కళ్ళల్లోకి చూడలేకపోయింది.

"రజనీ — నీ హృదయంలో యింకా నాకు తావుందా"

"అనవసర ప్రశ్న! ప్రయోజనంలేని జవాబు కోసం యింకా యెదురు చూస్తున్నావా బావా" శేఖరం నిలువునా నీరయిపోయాడు. "రజని యెంతగా మారిపోయింది. ఎంత తియ్యటిమాటలు యెంత కటువుగా వినిపించాయి." విస్తుపోయాడు శేఖరం.

"ఎంతపని చేశావు రజనీ"

"నేను చేయగలిగిందింతే బావా"

"కాదు. నువ్వవద్దంటే యింతకాలం ఆగినవాళ్లు యీ నాలుగురోజులు ఆగకపోదుగా—నే నింక తిరిగి రానేరాననుకొన్నావా? వచ్చినా నిన్ను పెళ్లాడననుకొన్నావా—నా మనసు నీకు తెలియదా"

"తెలుసు బావా—కాని పరిస్థితుల ప్రభావం—విధి—"

"కాదు..నన్ననుమానించావు. ఏదో పెద్ద ఆఫీసరునయ్యానని—నిన్ను మరిచిపోయాననుకొన్నావు" ఏదో వుద్రేకం ముంచుకు వచ్చింది. ఆవేశంలో రజని చేతులుపట్టుకొని "రజనీ — యెలా మరిచిపోగలను రజనీ నిన్ను —" దగ్గరకు లాక్కోబోయాడు. "శేఖరం! మూర్ఖుడవైపోకు—చేతులు విడిచి పెట్టు—" అంటూ నే చేతులు లాగికొని లేచి దూరంగా నిలుచుంది. "నీ చేతులు విడిచి యెలా బ్రతకగలను రజనీ"

"ఈ పరిస్థితుల్లో నేను చేయగలిగిందిమాత్రమేనుంది బావా"

"మాధవయ్యగారికి విడాకులిచ్చేసేయ్ రజనీ! మీ నాన్న ఋణం యెంత వున్నా తీరుస్తాను. నిన్ను నేను పెళ్లాడతాను—విడాకు లిచ్చేసేయ్ రజనీ—" ఒకసారి తీక్షణంగా చూచి అంది.

"తిన్నయింటివాసాలను లెక్కపెడుతున్నావా బావా? నిన్నింత అభివృద్ధిలోకి తెచ్చిన ఆయనకే యింత ద్రోహమా"

"కావచ్చు — కానీ — చేతులారా నా జీవితాన్ని నేను నాశనం చేసుకోలేను రజనీ—కావాలని నువ్వు నాశనం చేయకు—రజనీ—"

"పిచ్చివ్యామోహంలోపడి వివేకాన్ని పోగొట్టుకోకు బావా! నీకు అంకితమైన హృదయాన్ని మరొకరికివ్వలేనట్లే మరొకరి కర్పించిన శరీరాన్ని నీకెలా యివ్వగలను బావా"

"నా గుండెల్లోని మంటను చూడకుండా మాట్లాడుతున్నావు"

"అవును బావా! నా గుండెలు మండిమండి మాడి మసయిపోయాయి"

"అందుకే నేను చెప్పినట్లు చేయి. తిరిగి జీవితానందాన్ని పొందవచ్చు"

"కాదు శేఖరంబావా! యింతవరకు కళంకపడని మన చరిత్రను జీవితాంతం పవిత్రంగానే నిలుపుకొందాం. ఇక నామాట మరిచిపో బావా" ఈమాటల్లో యేదో అనుమానం—ఏదో అసంతృప్తి—స్పష్టంగా కనుపించా యతనికి. ఏమూలనుంచో యింతవరకు అణచిపెట్టబడిఉన్న—మనోదౌర్బల్యం ఒక్కసారిగా ఉబికి బయటకు వచ్చింది. మానవసహజమైన అనుమానం — అసూయ — అతన్ని దారి తప్పించాయి. "రజనీ! నువ్వ నన్ను నిజంగా ప్రేమించలేదు. అవునా — ఆ రోజుల్లో కట్నం లేకుండా పెళ్లి కాదని భయపడి—పెళ్లాడుతాను కదా అని—నన్ను ప్రేమించినట్లుగా నటించావు. ఇప్పుడొక లక్షాధికారి భర్తగా వచ్చాడు కాబట్టి నా అవసరం తీరిపోయింది. మా అమ్మ అందుకే యేడ్చింది.—పెళ్ళినాడు నా మాటయినా తలపెట్టకుండా కులుకుతూ తిరిగేవటగా.—యిప్పుడర్థమయ్యింది నీప్రేమ. ఇష్టం లేదని చెప్పక యెందుకలా "పవిత్ర ప్రేమ" అంటూ డొంకతిరుగుడుగా మాట్లాడుతావు—సంగనాచిలాగ" శేఖరం ఒక్కసారిగా మానవత్వన్నుంచి నాలుగు మెట్లు క్రిందికి దిగజారాడు. క్షణంలో ఉద్రేకం పొందినట్లే క్షణంలో పశ్చాత్తాపంకూడా పొందుతాడని రజనికి బాగా తెలుసు. అయినా ఆమె ముఖం కందగడ్డలా కందిపోయింది. "ఒకప్పుడు మధుకూడా యిలాగే దెప్పిపొడిచాడు. ఇప్పుడు శేఖరంకూడా యిలాగే అంటున్నాడు. ఇక యిద్దరికీ తేడా యేమిటి? ఏమో తేడామాత్రం బ్రహ్మాండంగానే వున్నట్లు తోచింది. శేఖరంమీద్ధ తనకు కోపంలేదు. కానీ బాధమాత్రం నిలువునా దహించేస్తూవుంది." అప్పటికే శేఖరం తానెంత అసభ్యంగా మాట్లాడేడో గుర్తించి లోలోన నొచ్చుకొంటున్నాడు. తెలియక తప్పుచేసి తగాదా తెచ్చి తనముందు గడగడలాడుతూ వున్న కొడుకును తల్లి చూచినట్లుగా చూచి బరువుగా నిట్టూర్చి అంది. "ఇటువంటి మాటలు వినవలసివస్తా

యనుకుంటే అసలు రాకపోదును బావా! నువ్వేమనుకున్నా నాకు బాధలేదు నిర్జీవమైన యంత్రాల మధ్య బ్రతికివచ్చిన నీకు సజీవమైన మానవ హృదయ రహస్యాలు అర్థంకావులే—" పైటచెంగుతో కళ్ళు తుడుచుకోవటం చూచిన శేఖరం వెన్నలా కరిగి పోయాడు. ప్రాధేయపడుతూ అడిగేడు. "క్షమించు-రజనీ—" "అది నీ తప్పుకాదు బావా! పరిస్థితుల ఒత్తిడికి మానవుడు లొంగకతప్పదు. ఇప్పుడు నువ్వున్న పరిస్థితిలో యేమగాడున్నా నీలాగ వట్టి మాటలతో సరిపెట్టి వూరుకోడని నాకు తెలుసు. మన యిద్దరిలో యే ఒక్కరూ యే తప్పూ చేయలేదని అందరకూ తెలుసు—అయినా యెందుకు మనకీ భరింపరాని శిక్ష. అదే బావా విధి.—అనుకోకుండా వచ్చిన యీ విచిత్ర పరిణామాన్ని హృదయపూర్వకంగా స్వీకరించి మన చరిత్రను పవిత్రం చేదాం బావా!" లేనివస్తువుకోసం మారాముచేస్తున్న చంటి వాడిని అమ్మమ్మ లాలించినట్లుగా అనునయంగా అంది.

"రజనీ" గత్యంతరంలేదా అన్నట్లు జాలిగా చూశాడు.

"నిష్కల్మషమైన ఆత్మానందం— సంపూర్ణమైన మానసిక తృప్తి మరేవిధంగానూ రాదు బావా" శేఖరం చాలసేపు దీర్ఘంగా ఆలోచించి భారంగా నిట్టూర్చాడు. తర్వాత కొన్ని క్షణాలవరకూ యిద్దరి మధ్యా మౌనం ఘనీభవించింది. చివరకు రజని నెమ్మదిగా అంది. "నినొ్నక వరం అడుగుదామని వచ్చాను-కోరుకోమంటావా బావా?" శేఖరం ఒకసారి ఆమె కళ్ళల్లోకి సూటిగాచూచి అన్నాడు "కోరుకొం టావా—కాదు—ఆజ్ఞాపించు రజనీ" ఏం అడుగుతుందా అని యెదురుచూస్తున్నాడు. రజని నవ్వుతూ అన్నది.

"నువ్వు అన్నమాట దాటవని నాకు నమ్మకముంది. ఆ ధైర్యంతోనే — నువ్వు చెప్పినట్లుగా ఆజ్ఞాపిస్తున్నాను—వదినగారి హోదాలో."

"వదినగారి హోదాలోనా" నివ్వెరపోయాడు శేఖరం.

"అవును బావా! మా నాన్న మా పద్మకు కట్నంయిచ్చి పెళ్లి చేయలేదు. కట్నంలేకుండా పెళ్లి కాదు. పెళ్లి కావటంమాత్రమే ప్రధానమైతే మా చెల్లెలు నాకు అక్క అవుతుందేమోనని నాభయం. మా కుటుంబానికి మహోపకారం చేసినవాడవవుతావు. మాపద్మను పెళ్లాడు బావా—మన ప్రేమచిహ్నంగా యీ పవిత్ర కార్యం కలకాల ముంటుంది." శేఖరం శిఖండిని చూచిన ద్రోణాచార్యుడులాగ నిశ్చేష్టుడైపోయాడు. అప్రయత్నంగానే అన్నాడు. "—పద్మనా—"

"అవును బావా! మా పద్మ నిప్పులాంటి మనిషి! అందంలోగాని గుణంలోగానీ నాకు తీసిపోదు నువ్వంటే దాని కెంతో మక్కువ."

"అందంకోసంకాదు రజనీ—" పూర్తి కాకుండానే చటుక్కున అందుకొంది రజని. "—కాదు—నాకు తెలుసు — నా ఆనందంకోసం — నా కిచ్చిన వాగ్దానంకోసం పద్మను చేసుకొంటావు. అవునా? ఈ జన్మకు నిన్ను నేనడిగేదీ—నువ్వు చేయవలసిందీ యిదొక్కటే బావా" ధర్మరాజు జూదంలో ద్రౌపదిని పణముగా పెట్టినప్పుడు ఫలితంకోసం యెదురు చూస్తున్న దుర్యోధనునిలా యెదురుచూస్తూవుంది రజని. తన కిష్టం లేకపోయినా ప్రజాభిప్రాయాన్ని మన్నించటంకోసం సీతను అరణ్యాలకు పంపుతూ వున్న శ్రీరాముడిలాగ గంభీరంగా నిలుచుని ఠీవిగా అన్నాడు. "అలాగే రజనీ — నీ ఆనందం కోసం యిదేకాదు ప్రాణత్యాగమైనా చేయగలను—పెళ్ళాడతాను రజనీ" రజని ఆనందానికి అంతులేక పోయింది. "సంతోషం! ఉద్యోగంలోచేరి సెలవు తీసికొని వస్తావుకదూ! ఈలోపునే ముహూర్తం నిర్ణయించి తెలియపరుస్తాం —చాలా టయిమయ్యింది యిక వెళ్ళనా బావా?". "వెళ్ళిరా! రజనీ! కానీ వెళ్లేముందు మీ చెల్లెలిని ప్రేమించగలశక్తి యీ భగ్న హృదయానికి కలిగేటట్లు ఆశీర్వదించి మరీ వెళ్లు రజనీ" అతనిమాటలు — హిమాలయ పర్వతశిఖరాలు విరిగి మహాసముద్రంలోకి దొర్లిపడుతున్నట్లుగా — బరువుగా — నెమ్మదిగా బయటకు వచ్చాయి. "మీ రిద్దరూ నూరేళ్లు వర్ధిల్లాలి" రజని నిండు హృదయంతో దీవించింది. ఆమె "సెలవు బావా" అని చెప్పటంగాని వెళ్ళిపోవటంగానీ శేఖరం గమనించ లేదు "పద్మ—పద్మ — ఆ పెంకిపిల్ల — ఆ రౌడీ పిల్ల — తన భార్యా!" యేదో అసంతృప్తి యేదో ఆందోళన — అతని గుండెలను గాలంలా పట్టుకు లాగాయి.

తన చెల్లెలిని పెళ్లాడటానికి శేఖరం అంగీకరించాడన్న సంతోషంతో — యీ కమ్మని కబురు పద్మకు ఎప్పుడు చెప్పుదామా అన్న సంబరంతో రజని మూడడుగుల్లో పుట్టింటికి వచ్చేసింది. చెల్లెలికి పట్టబోతున్న అదృష్టానికి — చెల్లెలు అనుభవించబోయే శాంతి సౌఖ్యాలకు — రజని మనసులో ఆనందం సుడులు తిరుగుతూవుంది. అంతక్రితం పద్మ అన్న మాటలు గానీ — తనకు పద్మమీద కలిగిన హేయభావం గానీ — జరిగిన రభస గానీ — రవ్వంతయినా — చూచాయగానైనా కనుపించటం లేదు రజని ముఖంలో. ఆమె హృదయం రక్తసంబంధపు ప్రేమతో నాట్యమాడుతూవుంది — పరవళ్లు త్రొక్కుతూ వుంది. సంతోషంతో నవ్వుకుంటూ ప్రహరీగుమ్మం దాటి దొడ్డిగుమ్మం మెట్లెక్కబోతూవుంది — గుండెలు ఝల్లుమన్నాయి. "ఎవరా మాట్లాడేది." మధుగారి పెరట్లో — ప్రహరీగోడ అవతల యెవరో మాట్లాడుకొంటున్నారు. "ఈ పన్నెండుగంటల అర్ధరాత్రివేళ యెవరైవుంటారు?" ఆగి నిదానించింది. మధుగొంతుక స్పష్టంగానే తెలుస్తూవుంది. ప్రహరీగోడకు దగ్గరగా వెళ్ళింది. రెండవ వ్యక్తి స్త్రీలా వుంది — ఏడుస్తూవున్నట్లుంది. "పద్మ గొంతుకులా వుంది" అనుకోగానే రజని కాళ్లు వణికేయి. ముచ్చెమటలు ముంచెత్తాయి. తనకు తెలియకుండానే రజని నెమ్మదిగా ప్రహరీ తిరిగి — గేటుదాటి మల్లెపందిరిచాటుకు వెళ్ళింది. రజని హృదయం బ్రద్దలు కాబోయేముందున్న అగ్ని పర్వతంలాగ కుతకుతలాడిపోయింది. "పద్మ — మధు మాట్లాడుకొంటున్నారు." రజని హృదయం పాము నోటికి జిక్కిన కప్పలా గిజగిజలాడింది. "అబ్బా! యెంత — నంగనాచి — పద్మ! ఎంత దమత్కారంగా నమ్మించింది — తన చెల్లెలు — శేఖరంబావకు కాబోయే భార్య — నిప్పులాంటి మనిషి —" ఇంక ఆలోచించలేకపోయింది రజని.

"నన్నేం చేదామని." వెక్కి వెక్కి యేడుస్తూ వుంది పద్మ.

"నేను చేయటానికేముంది — మామూలుగానే వుంటావు."

"నువ్వు బొంబాయి వెళ్ళిపోతున్నావటగా" అన్న పద్మమాటలు విని రజని మెదడు తిరిగి పని చేయటం ప్రారంభించింది. పాతమాట యేదో జ్ఞాపకంవచ్చి గుండెలు గతుక్కుమన్నాయి. ఒళ్లు గగుర్పొడిచింది.

"ఎవరన్నారు?" కోపంగానే అడిగాడు మధు.

"మీ దాసీది చెప్పింది."

"అవును. వెళతాను. తెల్లవారుఝామునే వెళతాను" సీతను తిరిగి రాముని చెంతకు పంపించేయమని బ్రతిమాలినపుడు మండోదరిని రావణాసురుడు ధిక్కరించినట్లుగా అన్నాడు. "అయితే నా గతేం గాను?" దుఃఖం పొంగిపోతూ అంది. "నాకేం తెలుసు?" "నాకు నెలతప్పిందని తెలుసుగా" రజని గుండెలపై ఆటంబాంబు పడ్డట్లయింది. ఇక నిలుచోలేక — క్రింద పడిపోకుండా — కూర్చుంది.

"అది నా తప్పుగాదు" — "నాదేనా తప్పు?"

"అవును! కొవ్వెక్కి నన్ను కవ్వించావ్! నన్ను నీ ఆనందానికి వినియోగించుకొన్నావు. నీ కామతృష్ణ తీర్చుకోవటానికి నాదగ్గరకు చేరావు. దాని ఫలితంగా గర్భవతివైతే అందుకు నేను బాధ్యుణ్ణిగాను." పద్మ నోటిలో పమిట చెంగు కుక్కుకొని కుమిలి కుమిలి యేడుస్తూవుంది. "నేను రేపే వెళ్ళిపోతున్నాను — కావలిస్తే యిదిగో యీ డబ్బు పట్టుకొని వెళ్లు" అంటూ ఓ గుప్పెడు నోట్లు పద్మ ముఖంమీదికి విసరి — శకుంతల పుట్టినప్పుడు మేనకను, పసికందును నట్టడవిలో వదలి వెళ్లిపోయిన విశ్వామిత్రునిలాగ — చరచరా లోపలకు పోయి తలుపులు మూసుకొన్నాడు మధు. రజని హృదయం — డమాను త్రాడు తెగిన తెరచాపలా — రెపరెపా కొట్టుకొంటూ వుంది. "నెల తప్పిన పద్మను — కన్నుగప్పి తన ప్రేమ దేవుని మెడకు గట్టటమూ — ఈ సంగతి తండ్రి వింటే యేం జరుగుతుంది" సమాధానం — భూమ్యాకాశాలు కలిసిన చోటులాగ అగమ్యముగా వుంది. పద్మదుఃఖం చూడలేక రజని గుండెలు తరుక్కుపోతున్నాయి. అనాలోచితంగానే ముందుకు వెళ్ళి "పద్మా" అంది. పద్మ త్రుళ్ళిపడి రజనిని చూచి — చెలియలికట్ట దాటివచ్చిన మహాసముద్రంలాగ పొంగి పొరలెత్తిన దుఃఖంతో "అక్కా!" అంటూ రజని పాదాలపై వాలిపోయింది. అన్ని భావాలను అధిగమించి రక్తసంబంధపు వాత్సల్య సౌహార్ద్రాలు ఒక్కుమ్మడిగా ఉబికివచ్చి "చెల్లీ" అంటూ రజని పద్మను కౌగిలించుకొంది.

నంగనాచి

మరునాడు "రజని—మధుతో లేచిపోయింది" అనే వార్త క్షణంలో వూరంతా గుప్పుమంది. గంటల్లో గ్రామాలు దాటి ప్రాకిపోయింది. "మధు బొంబాయి వెళ్లాడు — పద్మ కనిపించటంలేదు — కాబట్టి యిద్దరూ లేచిపోయారు" అని నిర్ణయించింది లోకం. కనకయ్య అవమానంతో వీధిముఖం చూడ లేకపోతున్నాడు. పద్మ కుళ్లికుళ్లి యేడుస్తూవుంది. "నన్ను వంచించింది—నమ్మించింది—నంగనాచి— నేను లేని యీ నాలుగేళ్లూ వాడితో...ఛీ! ఛీ! ఇదా పవిత్రప్రేమ! దీనికోసమా యే త్యాగమైనా చేదామనుకొన్నాను —" అసూయతో అసహ్యంతో పళ్లు కొరికేడు శేఖరం! వెంటనే తల్లిని తీసుకొని ఉద్యోగానికని వెళ్ళిపోయాడు. "పిల్లలు కలుగలేదు సరి గదా పెళ్ళాం యిలా చేసిందేమిటా" అనుకొంటూ మాధవయ్య పడకగదిలోకి వెళ్ళి —రజని పట్టుకుపోయిందనుకొన్న నగలు — ఉత్తరం — వుండటం చూచి ఖిన్నుడైపోయి కంగారుతో వుత్తరం చదువసాగాడు.

శ్రీవారికి నమస్కారాలు!

నేను వెళుతున్నాను. తిరిగి రాను. ఇందుకు కారణం మీరు గాదు. నేనుకూడా గాదు. అయినా వెళ్ళిపోతున్నాను. పిల్లలకోసం రెండువేలు వదులుకొని నన్ను పెళ్లాడేరు. నావల్లకూడా మీకు పిల్లలు కలుగరని నా నమ్మకం. మీ రెండువేలకు ప్రతిఫలంగా మా చెల్లెలు పద్మను పెళ్లాడండి! వెంటనే పెళ్ళాడండి! దానికడుపున పిల్లలు తప్పకుండా పుడతారు. నాలో యే దోషం లేదనిమాత్రం నమ్మండి! తప్పులు చేసివుంటాను తెలియక — మీతో వున్న కొద్దికాలంలోనూ—! దయతో క్షమించండి! ఇట్లు

—రజని

మాధవయ్య ఉత్తరం పట్టుకొనివచ్చి కనకయ్య కిచ్చాడు. కనకయ్య సమాధానం చెప్పకముందే "అలాగే అను నాన్నా—అక్క చెప్పిందానికి నేను ఒప్పుకొంటున్నాను" అంది పద్మ. ఆనవాయితీ తప్పించాలని పద్మ మెడలో పసుపుకొమ్ముకట్టి తీసుకుపోయాడు మాధవయ్య. ఆ సాయంకాలం మాధవయ్య గారి పాలేరు గుండెలు బాదుకొంటూ పరుగెత్తుకువచ్చి "పై పెరడు పాతబావిలో యేదో శవం వుందని" చెప్పాడు. చూచేటప్పటికి అది రజని శవం! "రజని లేచిపోలేదా" మాధవయ్య కనకయ్య మొగమొగాలు చూచుకొని యేడ్చేరు. పద్మ లోలోపల పుటం పెట్టినట్లుగా కుమిలిపోతూవుంది. పోలీసులకు తెలిస్తే అనవసరపు రభస జరుగుతుందని—పాడుపడిన పాత బావిని పూడ్పించేసినట్లు—రజని శవాన్ని అందులోనే వుంచి—నూతిని కప్పించేడు మాధవయ్య. గుట్టుచప్పుడు కాకుండా రజనికి తిలోదకాలు వదిలేరు.

పెళ్లయి ఎనిమిది నెలలు నిండగానే పద్మ పనసతొనలాంటి కొడుకును కన్నది. పుత్రోదయానందముతో తన్మయుడైన మాధవయ్య 'ఆ నెలల సంగతి' పట్టించుకోలేదు. "ఎంత కాలానికి దొరికాడు తనకు వారసుడు!"

నాటికీ నేటికీ ప్రజల దృష్టిలో రజని "నంగనాచి"గానే కనబడుతూవుంది. పద్మమాత్రం ప్రతి రోజూ ఉదయాన్నే "రహస్యంగా" పద్మ ఫొటోకు నమస్కరించి కొడుకుచేత నమస్కారం చేయించేది. ఆ "నమ్మించిన నంగనాచి"ని తలచుకొని యిప్పటికీ యెలిజబెత్ భర్త—యింజనీరు—జాన్ చంద్రశేఖర్ పళ్లు పటపటా కొరుకుతూనే వున్నాడు.